# వాసనలేని పువ్వులు

మండోదర్రావు గొప్ప అనుమానం మనిషి. ఏ విషయాన్నయినా ఒకటికి పది పర్యాయాలు క్షుణ్ణంగా పరీక్షిస్తేగానీ తృప్తిచెందడు.

"ప్రతి చిన్న విషయంలోనూ మరీ అంత చాదస్తం మంచిది కాదురా!" అని ఇటు తల్లిదండ్రులు, అటు స్నేహితులు ఎన్నోమార్లు మండోదర్రావును హెచ్చరించారు.

కానీ మండోదర్రావు ఎవరి మాటలూ ఖాతరు చెయ్యలేదు. ఏ విషయంలోనూ తను కాంప్రమైజయ్యే ప్రసక్తి లేదన్నాడు.

మండోదర్రావుకి భాగ్యనగరంలో మంచి ఉద్యోగం వచ్చింది. అయితే విభీషణరావు తన తనయుడు మండోదర్రావుని ఒంటరిగా హైదరాబాదు పంపడం ఇష్టంలేక మంచి సంబంధం చూసి వెంటనే పెళ్లి జరిపించి కొడుకూ, కోడల్ని భాగ్యనగరం పంపించాడు.

తండ్రి మాటలకు ఎదురుచెప్పలేక అహల్య మెడలో తాళి కట్టినా ఆమెను అన్నివిధాలా పరీక్షిస్తేగానీ తన సహధర్మచారిణిగా అంగీకరించకూడదు అనుకున్నాడు.

అహల్య మంచి అందగత్తె. ఎం.ఏ. ఫస్ట్‌క్లాస్‌లో పాసయింది. తల్లిదండ్రులకు ఏకైక సంతానం. అహల్యను ఏ విధంగా పరీక్షించాలో నాలుగురోజులు చక్కగా ఆలోచించి మంచి ప్లాన్ తయారుచేశాడు. ముఖ్యంగా ఇల్లాలికి కావల్సింది సహనం, అణకువ, ఓర్పు కనుక ఆమె సహనాన్ని పరీక్షించాలనుకున్నాడు మండోదర్రావు.

వారం రోజులు రాత్రి ఇంటికి బాగా లేటుగా వచ్చాడు. అహల్య భర్తను ఆలస్యంగా రావడానికి గల కారణం అడగలేదు.

"ఈ రోజు ఫస్ట్ తారీఖు. జీతం డబ్బు మొత్తం క్లబ్బులో పేకాటలో ఓడిపోయాను!" అన్నాడు భార్యను కవ్విస్తూ.

అహల్య చిన్న చిరునవ్వు నవ్వి ఊరుకుంది. మర్నాడు సాయంత్రం ఆమె చూస్తుండగా

డ్రెస్సింగ్ టేబుల్‌మీద ఉన్న ఆమె ఉంగరం తీసి జేబులో వేసుకుని ఆఫీసుకు బయల్దేరాడు.

"తన ఉంగరం ఎక్కడికి తీసుకెళ్తున్నారని" అడగలేదు అహల్య.

ఓ రోజు మధ్యాహ్నం వారింటికో అమ్మాయి వచ్చి-"నా పేరు సునీత. మండోదర్రావుగారు వారం రోజులై మా ఇంటికి రావటంలేదు, కారణం తెలుసుకుందామని వచ్చాను".

"వారు ఇంకా ఆఫీసునుంచి రాలేదు.

వచ్చేసరికి చాలా లేటవుతుంది" అంది అహల్య.

"నేను వచ్చినట్లు చెప్పండి"' అంటూ వెళ్ళిపోయింది.

రాత్రి మండోదర్రావు ఇంటికి వచ్చాక సునీత వచ్చిన విషయం మామూలుగా చెప్పింది.

మండోదర్రావు తను అనుకున్న పరీక్షలన్నీ పూర్తిచేశాడు. అహల్య తను పెట్టిన పరీక్షలన్నిటిలోనూ నెగ్గినందుకు ఎంతో సంతోషించాడు. తను కోరుకున్న గుణాలన్నీ ఆమెలో ఉన్నాయి కనుక ఇంక ఆమెను ఇబ్బంది పెట్టకూడదనుకుని ఆఫీసునుండి బజారుకి వెళ్లి అహల్యకి మంచి పట్టుచీరొకటి కొన్నాడు. దారిలో మల్లెపూవులు కొని తొందరగా ఇంటికొచ్చేసరికి వీధిగుమ్మంలో పక్కింటి వారబ్బాయి ఎదురువచ్చి కీస్ అందించాడు-"ఆంటీ మీరొస్తే ఇమ్మంది!"' అని చెప్పాడు.

"అహల్య బహుశా ఏ షాపింగ్‌కో, గుడికో వెళ్లి ఉంటుంది" అనుకుని తాళం తీసి లోనికి వెళ్లాడు. ఎదురుగా డ్రెస్సింగ్ టేబుల్‌మీద ఉన్న ఉత్తరం తీశాడు.

"నా తల్లిదండ్రుల మనసు నొప్పించడం ఇష్టంలేక నీ చేత నామెడలో తాళి కట్టించుకున్నాను. అయినా నిన్ను అన్నివిధాలా పరీక్షిస్తేగానీ నా భర్తగా అంగీకరించకూడదనుకున్నాను.

"రిగ్రెట్! నా పరీక్షల్లో ఎందులోనూ నువ్వు నెగ్గలేకపోయావు. ఏ స్త్రీ ఇష్టపడని 'వాసనలేని పువ్వు'లాంటివాడివి నువ్వు. నా అదృష్టం కొద్దీ నేను కోరుకున్న అర్హతలున్న వ్యక్తినాకు లభించాడు. అతనితో జీవితాన్ని పంచుకుందుకు వెళ్తున్నాను. గుడ్‌బై!

-అహల్య."

ఉత్తరం చదివిన మండోదర్రావు మూర్ఛపోయాడు.

**(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 25-5-1998)** ✪